## క్లుప్తంగా

### తల్లిదండ్రులను గౌరవించుకోవాలి



**తొర్రూరు రూరల్:** తల్లిదండ్రులను ప్రతి ఒక్కరూ గౌరవించుకోవాలని వందేమాతరం ఫౌండేషన్ డైరెక్టర్ తక్కెళ్లపల్లి రవీంద్ర అన్నారు. శుక్రవారం మండలంలోని వెలికట్ట గ్రామ శివారు పీఎస్ఆర్ హైస్కూల్‌లో తల్లిదండ్రులకు పాదపూజ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పీఎస్ఆర్ పాఠశాల కరస్పాండెంట్ పానుగోటి సోమేశ్వర్‌రావు, సహజ ఆనంద యోగా సంస్థ వ్యవస్థాపకుడు రమేశ్ గురూజీ, ప్రిన్సిపాల్ బీనా రాజీ పాల్గొన్నారు.

### జీతాలు చెల్లించాలి

**మహబూబాబాద్ అర్బన్:** జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న స్కావెంజర్లకు 7నెలల పెండింగ్ జీతాలు చెల్లించాలని స్కావెంజర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు నెమ్మది వెంకటేశ్వర్లు అన్నారు. జిల్లా కేంద్రంలో డీఈఓ రవీందర్‌రెడ్డికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మంద మంజుల, సోమరపు మంగమ్మ, చిత్తారి ఉమా రాణి, నెమ్మది ఉషా పాల్గొన్నారు.

### దాడులు ఆపాలి

**నెహ్రూసెంటర్:** ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసీలపై జరుగుతున్న హత్యాకాండ, దాడులను వెంటనే నిలిపివేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సనప పొమ్మన్న, బండపల్లి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఆదివాసీలపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా ఈనెల 20వ తేదీన జరగనున్న సదస్సును జయప్రదం చేయాలని వాల్‌పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు మధార్, భాస్కర్‌రెడ్డి, శ్రవణ్, సారయ్య పాల్గొన్నారు.

### భూదానం



**నర్సింహులపేట:** మండలంలోని అజ్మీరతండా గ్రామ పరిధిలోని ఎర్రకుంట తండాలో అంగన్‌వాడీ కేంద్రం భవనం నిర్మాణం కోసం తండాకు చెందిన బానోతు రమేశ్ రెండు గుంటల భూమిని దానం చేశాడు. అట్టి భూదానం పత్రాలను గ్రామస్తుల సమక్షంలో శుక్రవారం అధికారులకు అందచేశాడు. గ్రామస్తులు రమేశ్‌ను అభినందించారు.

### భూముల పరిశీలన

**నెల్లికుదురు:** తొర్రూరు నుంచి మండలంలోని వావిలాల గ్రామ పరిధిలోంచి మహబూబాబాద్ వైపు వెళ్లే 930పీ నేషనల్ హైవే కోసం ఏర్పాటు చేసే టోల్‌ప్లాజా నిర్మాణానికి రైతులు కోల్పోతున్న భూములను తొర్రూరు ఆర్డీఓ గణేష్ శుక్రవారం సందర్శించి పరిశీలించారు. వావిలాల గ్రామ పరిధిలోని రైతులు భూములను ఇస్తే బతుకుదెరువు కోల్పోతామని ఆందోళన చేపట్టారు. తహసీల్దార్ కె.రాజు రెవెన్యూ అధికారులతో కలిసి భూములను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఇదే విషయం ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామని ఆర్డీఓ తెలిపారు.

### ఎమ్మెల్యే, ఎంపీ సహకారంతో అభివృద్ధి

**మహబూబాబాద్:** మాజీ సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే కేటీఆర్ జీఓలు ఇచ్చి నిధులు ఇవ్వకపోయినా ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, ఎంపీ బలరాంనాయక్ సహకారంతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని సీపీఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్ సారథిరెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 36వ వార్డులో సుమారు రూ.8లక్షలతో నిర్మాణం చేస్తున్న సీసీ రోడ్డు పనులను శుక్రవారం పరిశీలించారు. కార్యక్రమంలో నీరజారెడ్డి ధర్మన్న, విష్ణు, తిరుమలేష్, గోవర్ధన్ పాల్గొన్నారు.

### డైరీ ఆవిష్కరణ

**మహబూబాబాద్ రూరల్:** జిల్లా సహకార గెజిటెడ్, నాన్ గెజిటెడ్ డైరీని జిల్లా సహకార అధికారి ఎన్.వెంకటేశ్వర్లు శుక్రవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా డీసీఓ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఇంటర్నేషనల్ సహకార సంవత్సరం సందర్భంగా సహకార సంఘాల ఉద్యోగులు సమష్టిగా పనిచేసి సహకార ఉద్యమాన్ని బలోపేతం చేయాలన్నారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఎం.ప్రవీణ్, ఆనంద్ బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

### డ్రైవర్లు కీలకం

**మహబూబాబాద్ అర్బన్:** బాలల అక్రమ రవాణా నిర్మూలనలో డ్రైవర్లు కీలకమని షీటీం ఎస్సై సునంద అన్నారు. జిల్లా కేంద్రంలోని ముదిరాజ్ సంఘ భవనంలో శుక్రవారం ఎఫ్ఎంఎం సేవా సంస్థ వరంగల్ ఆధ్వర్యంలో డైరెక్టర్ సిస్టర్ అధ్యక్షతన మానవ అక్రమ రవాణా నిర్మూలనలో కారు, ఆటో, డీసీఎం డ్రైవర్లకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ డాక్టర్ నాగవాణి, జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యుడు డేవిడ్, ఎఫ్ఎంఎం కోఆర్డినేటర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

# అలంకారప్రాయమే..

- రూ.2కోట్ల నిధులతో నిర్మించిన దోబీఘాట్
- విద్యుత్ సౌకర్యం లేక ప్రారంభానికి నోచుకోని వైనం

**డోర్నకల్:** స్థానిక బైపాస్ రోడ్డులో నిర్మించిన దోబీఘాట్ అలంకారప్రాయంగా మారింది. గత కేసీఆర్ ప్రభుత్వం కులవృత్తులను ప్రోత్సహించేందుకు రజకుల కోసం డోర్నకల్‌లో మోడ్రన్ దోబీఘాట్ ఏర్పాటు కోసం రూ.2కోట్ల టీయూఎఫ్ఐడీ నిధులను మంజూరు చేసింది. బైపాస్ రోడ్డులోని ఆర్టీసీ బస్టాండ్ పక్కన మోడ్రన్ దోబీఘాట్ నిర్మాణ పనులు ప్రారంభించారు. దోబీఘాట్ భవన నిర్మాణ పనులు పూర్తి చేసిన అనంతరం భవనంలో భారీ వాషింగ్ మిషన్లతోపాటు డ్రైక్లీనర్లు, ఐరన్ మిషన్లను ఏర్పాటు చేశారు. పనులు పూర్తయిన తరువాత కాంట్రాక్టర్ జనరేటర్ సహాయంతో అన్నిరకాల మిషన్లతో ట్రయిల్ రన్ నిర్వహించి మున్సిపాలిటీ అధికారులకు అప్పగించారు. మున్సిపాలిటీ అధికారులు మోడ్రన్ దోబీఘాట్‌ను స్వాధీనపర్చుకుని ఆరునెలలు పూర్తవుతున్నా నేటికీ ప్రారంభానికి నోచుకోలేదు. దీంతో దోబీఘాట్ చుట్టూ పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి.

**విద్యుత్ సౌకర్యం లేక...**

మోడ్రన్ దోబీఘాట్ పూర్తిస్థాయిలో సిద్ధమైన విద్యుత్ సౌకర్యం కల్పించకపోవడంతో ప్రారంభానికి నోచుకోవడం లేదు. రూ.2కోట్ల నిధులలో రూ.1.9 కోట్ల నిధులను కాంట్రాక్టరు భవనంతోపాటు యంత్రాల కోసం వినియోగించారు. మిగతా రూ.10లక్షలు విద్యుత్ సౌకర్యం, ఇతర పనుల కోసం వినియోగించాల్సి ఉంది. దోబీఘాట్‌కు విద్యుత్ సౌకర్యం కోసం ప్రత్యేకంగా ట్రాన్స్‌ఫార్మర్‌ను అమర్చాల్సి ఉంది. ఇందు కోసం మున్సిపల్ కమిషనర్ చొరవ చూపితే టీయూఎఫ్ఐడీసీ నుంచి మున్సిపాలిటీ ఖాతాకు నిధులు జమ అయ్యే అవకాశాలు ఉన్నాయి. మున్సిపాలిటీ అధికారులు స్పందించి మోడ్రన్ దోబీఘాట్‌కు విద్యుత్ సౌకర్యం కల్పించి వినియోగంలోకి తేవాలని పట్టణ రజకులు కోరుతున్నారు.



డోర్నకల్‌లో ప్రారంభానికి నోచుకోని మోడ్రన్ దోబీఘాట్

# ప్రజలను మోసం చేసిన ప్రభుత్వం

- మాజీ మంత్రి సత్యవతిరాథోడ్

**కేసముద్రం:** ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను నిలువునా మోసగించిందని మాజీ మంత్రి సత్యవతిరాథోడ్ అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ కేంద్రంలో బీఆర్ఎస్ కార్యాలయంలో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి పాలన అధ్వానంగా మారిందన్నారు. గ్రామాల అభివృద్ధికి నిధులు రాక అగమ్యగోచరంగా మారిందన్నారు. బీసీ రిజర్వేషన్ల పేరిట బీసీలను మోసం చేసిందన్నారు. ఏడాది గడుస్తున్నా స్థానిక ఎన్నికలు లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి అధిష్టానం ఢిల్లీ అయితే, కేసీఆర్‌కు అధిష్టానం తెలంగాణ ప్రజలే అన్నారు. ఈనెల 27న వరంగల్ ఎల్కతుర్తిలో నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభకు అధిక సంఖ్యలో ప్రజలు హాజరు కావాలని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్, మాజీ జెడ్పీటీసీ రావుల శ్రీనాథ్‌రెడ్డి, మాజీ ఎంపీపీ వోలం చంద్రమోహన్, నీలం దుర్గేష్, మండల అధ్యక్షుడు ఎండి.నజీర్‌అహ్మద్, ప్రధాన కార్యదర్శి కముటం శ్రీనివాస్, జాటోత్ హరీష్‌నాయక్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సత్యవతిరాథోడ్

# ప్రతీ గింజను కొనుగోలు చేస్తాం..

- ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్

**మరిపెడ రూరల్:** రైతు సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని, రైతు పండించిన ప్రతీ గింజను కొనుగోలు చేస్తామని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోతు రాంచంద్రునాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఎల్లంపేట, రాంపురం గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి, జీవనజ్యోతి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే గ్రామ సమాఖ్యలతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయా గ్రామాల్లో ఏపీఎం బానోతు రాములు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలలో మాత్రమే విక్రయించుకొని మద్దతు ధర పొందాలన్నారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం రాములు, వ్యవసాయ అధికారి బోడ వీరసింగ్, పెండ్లి శ్రీనివాస్‌రెడ్డి, కోట వెంకట్‌రెడ్డి, రామసహాయం జైపాల్‌రెడ్డి, గండి వీరభద్రం, మల్లేశం, సీఏ రజిత శ్యామ్ మహిళా సంఘం సభ్యులు ధనమ్మ, స్వప్న, కవిత, స్వరూప, శోభయాదగిరి పాల్గొన్నారు.



ఎల్లంపేటలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాంచంద్రునాయక్

**ఉన్నత శిఖరాలను అధిరోహించాలి**

**మరిపెడ:** విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాల ఎమ్మెల్యే జాటోతు రాంచంద్రునాయక్ అన్నారు. మరిపెడ మున్సిపల్ కేంద్రంలోని సీతారాంపురం హైస్కూల్‌లో వియ్ఆర్ విత్ యూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు, వాటర్ బాటిల్స్ పంపిణీ చేశారు.

# స్వేచ్ఛ, సమానత్వానికి పూలే కృషి

అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం అహర్నిశలు కృషి చేసిన మహాత్మ జ్యోతిబా పూలే జయంతి వేడుకలు శుక్రవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా నాయకులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఆయన విగ్రహానికి, చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. స్వేచ్ఛ, సమానత్వం, ఐకమత్యం కోసం ఆయన చేసిన కృషి అపారమైందన్నారు. - సాక్షి నెట్‌వర్క్



మహబూబాబాద్ అర్బన్: పూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



మహబూబాబాద్ రూరల్: పూలే విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నాయకులు



కేసముద్రం: నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



నెహ్రూసెంటర్: నివాళులర్పిస్తున్న నాయకులు



గార్ల: నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు





మరిపెడ: ప్రభుత్వ పాఠశాలలో..



తొర్రూరు రూరల్: హరిపిరాలలో..



దోర్నకల్: నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

# రైతు సమస్యలపై పోరాటం చేయాలి



కురవి: జెండా ఎగురవేస్తున్న నాయకులు


**కురవి/ కేసముద్రం:** రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటాలు చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి శెట్టి వెంకన్న అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో అఖిల భారత కిసాన్ సభ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సంఘం జెండాను ఎగురవేశారు. ఈసందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని రైతుల సమస్యలపై దేశవ్యాప్తంగా పోరాటం చేసిన చరిత్ర సంఘానికి ఉందన్నారు. వడగళ్ల వర్షాలు, గాలి దుమారాలతో నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని, పంటల నష్టాన్ని సర్వే చేయాలని డిమాండ్ చేశారు. రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధరలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో నల్లపు సుధాకర్, మల్లిడి కోటయ్య, బొబ్బ వెంకట్‌రెడ్డి, కొండబత్తుల వెంకన్న, చెల్లగొల్ల మల్లయ్య, పిట్టల ఉపేందర్ పాల్గొన్నారు.

# ధరల పెరుగుదలపై నిరసన

**మహబూబాబాద్ రూరల్:** పేదలపై పన్నులు.. సంపన్నులకు రాయితీలు అనే విధంగా బీజేపీ ప్రభుత్వ పాలన కొనసాగుతుందని ప్రగతి శీల మహిళా సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తుపాకుల పద్మ, సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ కేసముద్రం సంయుక్త మండలాల కమిటీ కార్యదర్శి పైండ్ల యాకయ్య అన్నారు. ప్రభుత్వం పెంచిన చమురు ధరలు, వంట గ్యాస్ ధరలపై మండలంలోని కంబాలపల్లి జాతీయ రహదారిపై శుక్రవారం నిరసన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు తుపాకుల వెంకన్న, గలిగే పెంటయ్య, భిక్షం పుల్లయ్య, చంద్రమ్మ, హేమలత, మంగ్య పాల్గొన్నారు.

**ధరలను తక్షణమే తగ్గించాలి**

**గంగారం:** వంటగ్యాస్, చమురు ధరలను కేంద్ర ప్రభుత్వం పెంచి, సామాన్యులపై పెనుభారాన్ని మోపిందని, తక్షణమే ధరలను తగ్గించాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ గంగారం, కొత్తగూడ సంయుక్త మండలాల కమిటీ కార్యదర్శి పూనెం ప్రభాకర్ డిమాండ్ చేశాడు. శుక్రవారం మండల కేంద్రంలో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు కాంతారావు, భూమయ్య, వెంకన్న, కృష్ణ, ఆదినారాయణ పాల్గొన్నారు.



మహబూబాబాద్ రూరల్: రోడ్డుపై నిరసన తెలుపుతున్న నాయకులు

# రైతులను దగా చేస్తున్న పాలకులు



మక్కలను పరిశీలిస్తున్న సంఘం నాయకులు

**మహబూబాబాద్ రూరల్:** అఖిల భారత రైతు సంఘం ఆవిర్భావ దినోత్సవాన్ని జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ వద్ద శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా గిరిజన రైతు గుగులోత్ మోహన్‌తో సంఘం జెండాను ఆవిష్కరణ చేయించారు. అనంతరం సంఘం జిల్లా కార్యదర్శి శెట్టి వెంకన్న మాట్లాడుతూ.. అఖిల భారత కిసాన్ సభ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా అనేక ఉద్యమాలు జరిగాయని, ఇప్పటికి నేటి పాలకులు రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర ఇవ్వకుండా రైతాంగాన్ని దగా చేస్తున్నారని విమర్శించారు. అనంతరం మొక్కజొన్న కొనుగోళ్లను పరిశీలించి మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గునిగంటి రాజన్న, జిల్లా ఉపాధ్యక్షుడు బొబ్బ వెంకటరెడ్డి, నాయకులు గుండు రవి, తారాసింగ్, బుచ్చిరాములు, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

# తాటి చెట్టును ఢీకొని కారు దగ్ధం

**కేసముద్రం:** ప్రమాదవశాత్తు తాటిచెట్టును ఢీకొన్న కారులో మంటలు వ్యాపించిన సంఘటన ఇనుగుర్తి మండల కేంద్రం సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. ఎస్సై మురళీధర్‌రాజు తెలిపిన వివరాల ప్రకారం.. కొడకండ్ల మండలం జీబీతండాకు చెందిన గుగులోతు సుమన్ అనే వ్యక్తి, హన్మకొండలో బేకరీ షాపు నడుపుతున్నాడు. ఈ మేరకు శుక్రవారం తెల్లవారుజామున సుమన్ తన కారులో సమీప బంధువును ఎక్కించుకుని, ఇనుగుర్తి మండలంలోని ఐలయ్య బావితండాతో దించాడు. తిరిగి కారులో తొర్రూరు వైపు వెళ్తుండగా, ఇనుగుర్తి సమీపంలో ప్రమాదవశాత్తు కారు అదుపు తప్పి తాటిచెట్టును ఢీకొట్టింది. దీంతో కారు ధ్వంసం కావడంతోపాటు, మంటలు అంటుకున్నాయి. అప్రమత్తమైన డ్రైవర్ సుమన్ వెనక డోర్‌లో నుంచి బయట పంట పొలాల్లోకి దూకాడు. దీంతో అతడి కాలుకు తీవ్రగాయాలయ్యాయి. కాగా మంటలు మరింతగా వ్యాపించడంతో కారు పూర్తిగా దగ్ధమైంది. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు చేరుకున్నారు. క్షతగాత్రున్ని 108లో మానుకోట జనరల్ ఆస్పత్రికి తరలించారు. కారులో నుంచి బయటకు దూకడంతో డ్రైవర్ ప్రాణాలతో బయటపడ్డాడు.

### అర్హులందరికీ సంక్షేమ పథకాలు

**డోర్నకల్:** కాంగ్రెస్ పాలనలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని కాంగ్రెస్ సీరోలు మండల అధ్యక్షుడు కొండపల్లి కరుణాకర్‌రెడ్డి తెలిపారు. సీరోలు మండలం మన్నెగూడెం గ్రామంలో శుక్రవారం జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు రవీందర్‌రెడ్డి, నరసయ్య, లక్ష్మీనారాయణ, రమేశ్‌నాయక్, వెంకన్న పాల్గొన్నారు.

## సంక్షిప్త సమాచారం

**వక్ఫ్ బిల్లును రద్దు చేయాలి**

**కురవి:** కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ బిల్లును రద్దు చేయాలని మౌలానా యూనుస్, సదర్ షేక్ రషీద్, రహీం డిమాండ్ చేశారు. శుక్రవారం కురవిలోని మజీద్‌లో ప్రార్థనల అనంతరం నల్లబ్యాడ్జీలు ధరించి, నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జాంగీర్, మహమూద్, షానవాజ్ పాల్గొన్నారు.

**విరాళం అందజేత**

**మహబూబాబాద్ రూరల్:** ఉద్యోగ విరమణ సందర్భంగా మహబూబాబాద్ మండలంలోని కంబాలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం శ్రీరాం రమేశ్ బాబు పాఠశాల అభివృద్ధి కోసం శుక్రవారం రూ.10 వేలు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం జి.ఉప్పలయ్య, కార్యదర్శి రామసహాయం శ్రీధర్ రెడ్డి, సోహెన్ బీ, శ్రీనివాసరావు, శిబారాణి, సతీష్ కుమార్, సోమేశ్వర్, ఝాన్సీ, మల్లారెడ్డి పాల్గొన్నారు.

**ఎల్‌సీపై శిక్షణ తరగతులు**

**మరిపెడ:** విద్యుత్‌కు అంతరాయం కలుగకుండా లైన్ క్లియరెన్స్(ఎల్‌సీ) ఎలా తీసుకోవాలి అనే అంశంపై మరిపెడ మున్సిపాలిటీ పరిధిలో శిక్షణ తరగతులు శుక్రవారం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి విద్యుత్ శాఖ ఎస్ఈ నరేష్ హజరై మాట్లాడుతూ.. ఎల్‌సీలు ఆన్‌లైన్ ద్వారా యాప్‌లో ఎలా తీసుకోవాలి, రిటన్ ఎలా చేయాలో వివరించారు. కార్యక్రమానికి డీఈ మధుసూదన్, రాజం, రాజ్యలక్ష్మి, అజయ్, సిబ్బంది పాల్గొన్నారు.

**పౌష్టికాహారం తీసుకోవాలి**



**గార్ల:** గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా పుడతాడని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.ఉషారాణి అన్నారు. శుక్రవారం మండలంలోని సీతంపేట పంచాయతీ మంగలితండా అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్వాడాలో భాగంగా గర్భిణులకు సీమంతాలు చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సంపూర్ణ, ఏఎన్ఎం సడాలి, అంగన్‌వాడీ టీచర్లు నీలాదేవి, రుక్కమ్మ, ఆయాలు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

**నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం**

**కురవి:** కురవి మండలం అయ్యగారిపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా నేడు(శనివారం) ఉదయం 8గంటల నుంచి 10 గంటల వరకు సబ్‌స్టేషన్ పరిధిలోని అన్నిగ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ శారద శుక్రవారం తెలిపారు.

**నెహ్రూసెంటర్‌లో..**

**నెహ్రూసెంటర్:** విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా నేడు జిల్లా కేంద్రంలోని కొత్త బజారు, పాత బజారులో ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 11గంటల వరకు విద్యుత్ సరఫరా నిలివేయనున్నట్లు ఏఈ సంగీత శుక్రవారం తెలిపారు.

**ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం**

**దోర్నకల్:** మండలంలోని తహసీల్దారు బంజర గ్రామంలో శుక్రవారం ఐకేపీ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏపీఎం శంకర్ నాయక్ ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బత్తుల శ్రీనివాసయాదవ్, సురేందర్ జైన్, కాలం రవీందర్‌రెడ్డి, సీసీలు ఉన్నం రాధ, ఉమ, విజయలక్ష్మి, హరీశ్ పాల్గొన్నారు.

**అరెస్ట్ వారెంట్ జారీ**

**దోర్నకల్:** ఓ కేసుకు సంబంధించి కోర్టుకు వాయిదాలకు హాజరు కాని వ్యక్తికి మహబూబాబాద్ కోర్టు మెజిస్ట్రేట్ అరెస్ట్ వారెంట్ జారీ చేశారు. డోర్నకల్ పోలీసులు శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని హూన్యాతండాకు చెందిన భూక్యా ప్రశాంత్ ఓ కేసులో ముద్దాయి కాగా కోర్టు వాయిదాలకు హాజరు కానందున కోర్టు మెజిస్ట్రేట్ అరెస్ట్ వారెంట్ జారీ చేయడంతో డోర్నకల్ పోలీసులు జ్యుడిషియల్ రిమాండ్ గురించి శ్రీకాంత్‌ను కోర్టులో హాజరుపర్చారు.

**చోరీ కేసులో నిందితుడి అరెస్టు**

**తొర్రూరు:** పట్టణంలోని మున్సిపాలిటీ కార్యాలయం సమీపంలో తాజాగా జరిగిన చోరీలో నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్సై ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని మున్సిపాలిటీ కార్యాలయం సమీపంలోని ఓ ఇంట్లో చోరీ జరిగింది. ఇంటి యజమాని మహేష్ ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఈ చోరికీ పట్టణానికి చెందిన తూర్పాటి సాయి పాల్పడ్డాడని తేల్చారు. అతడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

**ఇసుక ట్రాక్టర్ల సీజ్**

**నెల్లికుదురు:** మండల కేంద్రంలోని ఆకేరు వాగులో రెవెన్యూ అధికారులు దాడులు చేసి అక్రమంగా తరలిస్తున్న 11 ఇసుక ట్రాక్టర్లను పట్టుకుని కేసు నమోదు చేసి సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తహసీల్దార్ రాజు శుక్రవారం తెలిపారు.

**కురవిలో..**

**కురవి:** మండలంలోని నేరడ శివారు జంగిలిగొండ క్రాస్ రోడ్డు సమీపంలో అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను కురవి ఆర్ఐ రవికుమార్ శుక్రవారం పట్టుకుని కురవి పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు. ఇదే విషయమై కురవి పోలీసులను వివరణ కోరగా ఇసుక ట్రాక్టర్ స్టేషన్‌కు అప్పగించారని తెలిపారు. ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకోవడంతో పలువురు నేతలు ఆర్ఐ రవికుమార్‌కు ఫోన్‌లు చేసినట్లు సమాచారం.

**చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి**

**మరిపెడ రూరల్:** మరిపెడ మండలం చిల్లంచర్ల గ్రామానికి చెందిన అనంతుల విష్ణు (30) జనవరి నెలలో రోడ్డు ప్రమాదానికి గురై మూడు నెలలుగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. వివరాలు.. మండలంలోని చిల్లంచర్ల గ్రామానికి చెందిన అనంతుల విష్ణు ఇంటి వద్ద వ్యవసాయంతోపాటు మండల కేంద్రంలో కొరియర్ బోయ్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈక్రమంలో జనవరి 25న విధులు ముగించుకుని బైక్‌పై గ్రామానికి వస్తున్న క్రమంలో బక్కరూప్లతండా వద్ద బైక్ అదుపు తప్పి కింద పడ్డాడు. దీంతో విష్ణుకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

**విద్యుత్ షాక్‌తో పందులు..**

**దంతాలపల్లి:** మండలకేంద్రంలో విద్యుత్ షాక్‌తో రెండు పందులు మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. మండలకేంద్రానికి చెందిన ఓ రైతు బస్టాండ్ దగ్గర ఉన్న తన పొలం చుట్టూ విద్యుత్ తీగను రక్షణగా పెట్టుకున్నాడు. మండలకేంద్రానికి చెందిన మాదగాని యాకలక్ష్మీ, వెంకన్న దంపతులు తమ పందులను అటు వైపుగా మేత కోసం తీసుకెళ్లారు. సాయంత్రం పందులు విద్యుత్ తీగకు తగలడంతో షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందాయి. వాటి విలువ రూ.50వేల వరకు ఉంటుందని బాధితులు విలపించారు.

### ఉద్యోగ అవకాశాలు కల్పించాలి

**మహబూబాబాద్ రూరల్:** మల్యాల ఉద్యాన పరిశోధన స్థానంలో గతంలో పని చేసి మృతిచెందిన కుటుంబాల వారసులకు ఉద్యాన కళాశాలలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు బి.అజయ్ సారథిరెడ్డి కోరారు. ఈమేరకు జిల్లా కేంద్రంలోని ఉద్యాన కళాశాలలో డీన్ చీనానాయక్‌తో శుక్రవారం చర్చలు జరిపారు. కార్యక్రమంలో రేషపల్లి నవీన్, షరీఫ్, మహబూబ్ అలీ, యాకూబ్, కతీజ, యాకమ్మ పాల్గొన్నారు.

### రెమ్యునరేషన్ చెల్లించాలి

**గూడూరు:** 2024లో సోషల్, ఎకనామిక్ సర్వే చేపట్టిన ఉపాధ్యాయుల (ఎన్యూమరేటర్లు)కు రెమ్యునరేషన్ వెంటనే చెల్లించాలని డీటీఎఫ్ మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శి దూప్‌సింగ్, చందా కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల పరిషత్ అధికారి వీరస్వామికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో శ్రీనివాస్, లక్ష్మయ్య, నిర్మల, మల్లేషం పాల్గొన్నారు.